సాక్షి
అనంతపురం
సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18, కనిష్టం రూ.4.50, సరాసరి రూ.10 పలికింది.



ఏళ్ల కల.. నెరవేరుతున్న వేళ

కుటుంబ మ్యాపింగ్ సవరణకు జగన్ సర్కార్ అవకాశం కల్పించింది. అర్హులైన వారం దరికీ సంక్షేమ ఫలాలు అందించనుంది. 8లో

గరిష్టం/కనిష్టం
32.1°/15.7°

జిల్లా అంతటా ఆదివారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి.

న్యూస్‌రీల్

తూకాల్లో మోసాలు

- ఏడుగురు వ్యాపారులపై కేసులు



తూకాలు తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలో చిరు వ్యాపారులు తూకాల్లో మోసాలు చేస్తున్నట్లు తూనికలు, కొలతల శాఖ అధికారులు గుర్తించారు. ఆదివారం క్లాక్ టవర్, బస్టాండ్, రైల్వే స్టేషన్, చర్చి సర్కిల్ తదితర కూడళ్లలోని పండ్ల దుకాణాలు, కాయగూరల దుకాణాలపై తనిఖీలు నిర్వహించినట్లు అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.స్వామి తెలిపారు. వినియోగదారులు కొన్న పండ్లు, కూరగాయలను తిరిగి డిపార్టుమెంట్ కాటాపై తూకం వేయగా తేడా వచ్చింది. తక్కువ తూకాలు వేస్తున్న ఇద్దరు వ్యాపారులపైన, ముద్ర లేని కాటాలు, రాళ్లు వాడుతున్న మరో ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.మహమ్మద్ గౌస్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్‌శర్మ రాక

అనంతపురం అర్బన్: సీఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ సమీర్ శర్మ మంగళవారం అనంతపురం వస్తున్నారు. ఆ రోజు ఉదయం 7.45 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి 10.30 గంటలకు అనంతపురం చేరుకుంటారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌పై అధికారులతో సమీక్షిస్తారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. అనంతరం ఇక్కడి నుంచి బయలుదేరి శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి చేరుకుంటారు.

పకడ్బందీగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ డీఈఓ ఎస్.కృష్ణయ్య

అనంతపురం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షను ఆదివారం పకడ్బందీగా నిర్వహించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ హెచ్.గోవిందనాయక్ తెలిపారు. అనంతపురంలో మొత్తం 2,596 మంది విద్యార్థులకు గాను 2,460 మంది హాజరయ్యారు. 136 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జ్ డీఈఓ ఎస్.కృష్ణయ్య తదితరులు పర్యవేక్షించారు.

ఉడతా ఉడతా ఊచ్..ఫుడ్ దొరికిందోచ్..





బుల్లి ఉడతలకు ఆకలేసింది. చుట్టూ చూశాయి. ఓ గోడపై కాస్త ఫుడ్డు కన్పించింది. అమాంతం అక్కడికి చేరాయి. చెరిసగం పంచుకు తిన్నాయి. ఒకటి అక్కడే తినేయగా..మరొకటి సమీపంలోని చెట్టుపైకి వెళ్లి పుష్టిగా భోంచేసింది. ఈ దృశ్యాలు అనంతపురంలోని ఇరిగేషన్ కార్యాలయ ప్రాంగణంలో 'సాక్షి' కెమెరా కంటపడ్డాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



నేనిక్కడే తినేస్తా..



భలే బరువుందే..

ఇంటి వద్దకే వైద్యం

ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం పేదలకు వరంలా మారింది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు, గర్భిణులు, బాలింతలు చెకప్ కోసం ప్రతి నెలా పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడంత దూరం వెళ్లాల్సిన అవసరం లేదు. నిర్దేశిత తేదీల్లో ఇంటి వద్దకే వైద్యులు వచ్చి.. పరీక్షలు నిర్వహించి, వారికి మందులు ఉచితంగా అందిస్తున్నారు.



- 'ఫ్యామిలీ ఫిజీషియన్' సక్సెస్
- ఉమ్మడి జిల్లాలో పోటీపోటీగా సేవలు
- వ్యయప్రయాసలు తగ్గించిన ప్రభుత్వం
- ఉచితంగా వైద్య పరీక్షలు.. మందులు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఆరోగ్యశ్రీ రోగులకు ఉపశమనం
- ప్రభుత్వ చర్యలపై హర్షాతిరేకాలు
- మార్చి నుంచి పూర్తిస్థాయి వైద్య సేవలు



యల్లనూరు మండలం తిరుమలాపురానికి చెందిన యర్రంరెడ్డి రామకృష్ణారెడ్డికి డయాబెటిస్ అధికం కావడంతో పెరాలసిస్ సోకింది. ఇతనికి వైద్యం చేయించేందుకు తాడిపత్రి, అనంతపురం తీసుకెళ్లే వారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రవేశపెట్టాక ప్రభుత్వ వైద్యులు ఇంటి వద్దకే వచ్చి ప్రతి నెలా పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

ధనవంతులకు ఏ చిన్న జబ్బు వచ్చినా ఫ్యామిలీ డాక్టర్‌ను సంప్రదిస్తారు. డాక్టర్ ఇంటికి వచ్చి వైద్యం చేసి వెళ్తారు. మరి పేదలకు అంతటి ఆర్థిక స్తోమత ఉండదు కనుక ప్రభుత్వాస్పత్రులకు వెళ్లాల్సిందే. కదలలేని వారు, సహాయకులు లేని వారు, మంచాలకే పరిమితమైన రోగులు సరైన వైద్యం పొందలేకపోయేవారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ ఎక్కడా లేని విధంగా 'ఫ్యామిలీ ఫిజీషియన్' ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉమ్మడి జిల్లాలో వైద్య సేవలు పోటాపోటీగా రోగులకు అందుతున్నాయి. వైద్యుల బృందం గ్రామాల్లోకి వస్తోందంటే విశేష స్పందన కనిపిస్తోంది. ఇప్పటివరకు అనంతపురం జిల్లాలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల ద్వారా 91,816 మందికి లబ్ధి జరిగింది. శ్రీసత్యసాయి జిల్లాలో మరో అడుగు ముందుకేసి 92,560 మందికి సేవలందించారు. ఎంతోమంది వృద్ధులు, మహిళలు, బాలింతలు, గర్భిణులకు వైద్యులు ఇంటి వద్దకే వెళ్లి సేవలందిస్తున్నారు. చెంతకే వచ్చి వైద్య, రక్త పరీక్షలు చేయడం.. ఉచితంగా మందులు ఇవ్వడంతో పేదలకు ఆరోగ్యంపై భరోసా కలిగింది. మాకు ఏ జబ్బు చేసినా ప్రభుత్వముంది అన్న ధైర్యంతో ఉన్నారు.

హైపర్ టెన్షన్ రోగులకు ఊరట..

చాలామందికి హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) నియంత్రణలో లేక పక్షవాతానికి (పెరాలసిస్) గురయ్యేవారు. దీనివల్ల శాశ్వత వికలాంగులుగా మారేవారు. దీన్ని నియంత్రించేందుకు ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతోంది. గడిచిన కొద్ది నెలల్లోనే అనంతపురం జిల్లాలో 17,698 మంది హైపర్‌టెన్షన్ బాధితులకు, శ్రీసత్యసాయి జిల్లాలో 14,869 మంది బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. మిగతా జీవనశైలి జబ్బులకూ సేవలందించారు.

ఇప్పటివరకు గ్రామాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థ మార్చి నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది.

అనంతపురం జిల్లాలో జనవరి 25 నాటికి అందిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

	సేవలు
మొత్తం లబ్ధిదారులు	91,816
జనరల్ ఓపీ	43,961
గర్భిణులు	8,552
బాలింతలు	7,809
రక్తహీనత	575
హైపర్‌టెన్షన్	17,698
డయాబెటిక్	12,538
ఓరల్ క్యాన్సర్	316
బ్రెస్ట్ క్యాన్సర్	31
సర్వైకల్ క్యాన్సర్	206
టీబీ	12

ఆయుష్షు పెరుగుతోంది

ప్రతి నెలా ఆస్పత్రి బండి వస్తోంది. ఎక్కడకూ వెళ్లాల్సిన పని లేదు. ఇంటి దగ్గరకే వచ్చి ఆరోగ్య పరీక్షలు చేసి.. మందులు ఇస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పద్ధతి చూడలేదు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ఎంతో బాగుంది. ఐదేళ్లు బతికేవాళ్లు పదేళ్లు బతికే అవకాశం కలుగుతోంది. పేదల ఆరోగ్యంపై శ్రద్ధ కనబరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– వెంకటలక్ష్మి, ధర్మాపురం, గుత్తి మండలం



మెరుగైన వైద్యం

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాము. జిల్లాలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు సంబంధించి పూర్తిస్థాయిలో వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు, టెక్నీషియన్లను అందుబాటులో ఉంచాం. ప్రధానంగా బీపీ, షుగర్ రోగులు, గర్భిణులకు వైద్య చికిత్సలు అందించడంతో పాటు గృహ సందర్శన చేసి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యశ్రీ రోగులకు ఫాలోఅప్ చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ యుగంధర్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ

విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టోర్నీ విజేత ఆంధ్ర బీ జట్టు



విన్నర్‌గా నిలిచిన ఆంధ్ర బీ జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టోర్నీ విజేతగా ఆంధ్ర బీ జట్టు నిలిచింది. అనంత క్రీడా గ్రామంలోని ప్రధాన క్రీడా మైదానంలో ఆదివారం ఆంధ్ర ఏ, ఆంధ్ర బీ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్ర బీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 231 పరుగులు చేసింది. జట్టులో రోషిరెడ్డి 57 బంతుల్లో 16 ఫోర్ల సహాయంతో 104 పరుగులతో అజేయంగా నిలిచాడు. లీలాకృష్ణ 31 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 57 పరుగులు చేశాడు. ఆంధ్ర ఏ జట్టు బౌలర్లలో ఆదాం, చరణ్‌జిత్, వేణు చెరొక వికెట్ సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్ర ఏ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 149 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో సుబ్బరాయుడు 39, వెంకటయ్య 22 పరుగులతో రాణించారు. ఆంధ్ర బీ జట్టు బౌలర్లలో బ్రహ్మయ్య, శశి చెరి రెండు వికెట్లు తీశారు. ఆంధ్ర బీ జట్టు 82 పరుగులతో విజయం సాధించింది.

- అనంతరం ఆంధ్ర ఏ, బీ జట్లలోని క్రీడాకారులతో కూడిన ఆంధ్ర విభిన్న ప్రతిభావంతుల జట్టు మార్నింగ్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) జట్టుతో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్ర విభిన్న ప్రతిభావంతుల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసింది. జట్టులో రోషిరెడ్డి 45, నాగుల్‌మీరా 32, విజయ్‌కుమార్ 20 పరుగులతో రాణించారు. ఎంసీసీ జట్టు బౌలర్లలో సతీష్ రెండు, శివ, జయ చెరొక వికెట్ సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎంసీసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 122 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులో ప్రశాంత్ 60 పరుగులు చేశాడు. విభిన్న ప్రతిభావంతుల జట్టు బౌలర్లలో వెంకటయ్య 4, ఆదాం 2 వికెట్లు సాధించారు. దీంతో విభిన్న ప్రతిభావంతుల జట్టు 85 పరుగులతో గెలుపొంది సకలాంగులకు దీటుగా రాణించగలమని నిరూపించారు. ముగింపు కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టోర్నీలో విజేతలుగా నిలిచిన జట్లకు వారి చేతుల మీదుగా ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో రవికాంత్ క్యాటరర్స్ రవికాంత్ రమణ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, మధు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం..



కొండమీదరాయుని రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్త జనం..



సూర్యప్రభ వాహనంపై దేవేరులతో శ్రీవారు..



స్వామికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, భక్తులు

బుక్కరాయసముద్రం: కొండమీదరాయుని రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున నాలుగు గంటలకు బుక్కరాయసముద్రంలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో కొండమీదరాయునికి శ్రీదేవి, భూదేవితో కల్యాణోత్సవం రమణీయంగా సాగింది. ఉదయం 11.30 గంటలకు భూదేవి, శ్రీదేవి సమేత కొండమీదరాయుడిని సూర్యప్రభ వాహనంపై వేద పండితులు మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై కొలువుదీర్చారు. రథం ముందు హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 12.10 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. భక్తులు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి పాత పంచాయతీ కార్యాలయం వరకు లాగారు. తిరిగి సాయంత్రం రథం బ్రాహ్మణ వీధి, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం దగ్గరకు చేరుకుంది. జిల్లా నలుమూలల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గోవిందనామ స్మరణతో భక్తజనం పులకించిపోయింది. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, ఎంపీపీ సునీత, సర్పంచ్ పార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరి రమణారెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. సీఐ అస్రార్‌బాషా ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఆలయకమిటీ నిర్వాహకులు, దాతలు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



మేడపై నుంచే స్వామివారికి నమస్కరిస్తున్న మహిళలు

స్టాంపులపై అనధికార బాదుడు

- ఆగిన నాన్ జ్యుడీషియల్ స్టాంపుల సరఫరా
- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కొరత
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వెండర్లు
- రూ.100 స్టాంపు రూ.150కు విక్రయం

అనంతపురం టౌన్: అనంతపురానికి చెందిన గోపి రూ.100 నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అవసరమై రామ్‌నగర్‌లోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ స్టాంపులు దొరక్కపోవడంతో రుద్రంపేటలోని రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించినా నిరాశే ఎదురైంది. చేసేది లేక రామ్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం దగ్గరలోనే ఓ స్టాంప్ వెండర్‌ను ఆశ్రయించాడు. రూ.100 స్టాంపును రూ.150 చొప్పున రెండు కొనుగోలు చేశాడు. ఒక్క నగరంలోనే కాదు జిల్లా వ్యాప్తంగా స్టాంప్‌ల కొరత ఉంది. కొన్ని నెలలుగా రూ.100 స్టాంపుల సరఫరా నిలిచిపోయింది. స్టాంపుల కొరతపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో స్థిరాస్తి క్రయ విక్రయదారులతోపాటు స్టాంపుల అవసరాలు ఉన్న వినియోగదారులు నిర్దేశించిన ధర కంటే అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్టాంపుల కోసం కర్నూలు జిల్లాకు పరుగులు తీస్తున్నారు.

పని చేయని ఫ్రాంకింగ్ యంత్రం

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంప్‌లు ప్రింట్ తీసే ఫ్రాంకింగ్ యంత్రం ఐదు నెలలుగా పని చేయడం లేదు. స్టాంపుల కోసం రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది సైతం ఇతర కార్యాలయాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఫ్రాంకింగ్ యంత్రం ద్వారా స్టాంప్‌ల విక్రయంతో రూ.కోటికిపైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉంటుంది. గడిచిన ఐదు నెలలుగా పనిచేయకపోవడంతో రూ.5 కోట్ల ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది.

మారని స్టాంప్ వెండర్ల తీరు

నాన్ జ్యుడీషియల్ స్టాంపులను అధిక ధరలకు విక్రయించడంతోపాటు స్టాంపులపై పాత తేదీలను వేసి నకిలీ అగ్రిమెంట్లకు ఆజ్యం పోస్తూ భూ సమస్యలకు ప్రధాన కారణంగా నిలుస్తుండడంతో ఇటీవల జిల్లా విజిలెన్సు అధికారులు దాడులు నిర్వహించారు. కొందరు స్టాంపు వెండర్లపై కేసులు నమోదు చేశారు. అయినా వారిలో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. స్టాంపుల కొరతను ఆసరాగా తీసుకొని రూ.100 స్టాంపును అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దు



నాన్ జ్యుడీషియల్ స్టాంపులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తాం. ఇటీవల జిల్లా వ్యాప్తంగా 15 మంది స్టాంప్ వెండర్లు పాత తేదీలతో స్టాంపులను విక్రయించినట్లు విచారణలో బయటపడ్డాయి. దీంతో కొందరిపై కేసులు నమోదు చేయడంతోపాటు వారి లైసెన్సులు రద్దు చేశాం. రూ.100 నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరతను తీరుస్తాం. రెండు మూడు రోజుల్లో అందుబాటులోకి వస్తాయి. అప్పటిలోగా ఇతర కార్యాలయాల్లోని స్టాంపులను అన్ని కార్యాలయాలకు సర్దుబాటు చేస్తాం.

– మాధవి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, డీఐజీ

క్లుప్తంగా

మహాశివరాత్రి ఉత్సవాల బ్రోచర్ల ఆవిష్కరణ


బ్రోచర్లు, ఫ్లెక్సీలు ఆవిష్కరిస్తున్న ధర్మప్రచార పరిషత్ సభ్యులు

అనంతపురం కల్చరల్: ఈ నెల 18న సాయంత్రం నుంచి 19వ తేదీ ఉదయం వరకూ మహాశివరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్తంగా సన్నాహకాలు చేస్తున్నాయి. ఇందుకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్రోచర్లను ఆదివారం అనంతపురంలోని టీటీడీ కల్యాణమంటపంలో పరిషత్ సభ్యులు ఆవిష్కరించారు. ధర్మ చార మండలి ప్రతినిధులు శ్రీపాద వేణు, నాగేశ్వరి, పురాణ పండిట్ వేణు, సుధామణి మాట్లాడుతూ.. శివరాత్రి పర్వదినాన రాఘవేంద్ర మాణిక్ ప్రభువుల ఆధ్యాత్మిక ఉపన్యాసం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా భక్తులకు మరకత శివలింగాలు, కాలభైరవ కంకణాలు, పవిత్ర రుద్రాక్షలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. సంప్రదాయం ఉట్టిపడేలా ఆధ్యాత్మిక ప్రశ్నల పోటీలు, కోలాటం, శాస్త్రీయ, జానపద, నృత్య ప్రదర్శనలు, సంగీత కచేరీలు ఉంటాయని పేర్కొన్నారు. ఉత్సవంలో పాల్గొనే వారు ముందుగా 93983 72336, 94923 25020లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

వివాహిత బలవన్మరణం

రాయదుర్గం రూరల్: కడుపునొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. రాయదుర్గంలోని పైతోట ప్రాంతానికి చెందిన సిద్దలింగకు మూడేళ్ల క్రితం కర్ణాటకలోని మొలకాల్మూరు తాలూకా ఎద్దులబొమ్మయ్య దొడ్డికి చెందిన అంబిక (20)తో వివాహమైంది. పెళ్లై మూడేళ్లయినా సంతానం కలగకపోవడంతో కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం కడుపునొప్పి భరించలేక అంబిక క్రిమి సంహారక మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే మొలకాల్మూరులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం ఆమె మృతి చెందింది. మృతురాలి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రఘుబాబు తెలిపారు.

హోరాహోరీగా 'ఎస్‌పీఎల్'

- గెలుపే లక్ష్యంగా తలపడిన క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో అనంత క్రీడా గ్రామం వేదికగా మూడు ప్రధాన మైదానాల్లో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు రెండో రోజు ఆదివారం హోరాహోరీగా సాగాయి. గెలుపే లక్ష్యంగా క్రీడాకారులు తలపడ్డారు.

చెలరేగిన భార్గవ్

ఏఎస్‌కే డిగ్రీ కళాశాల (గోరంట్ల) జట్టుపై టాస్ గెలిచి సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ (పుట్టపర్తి) జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఏఎస్‌కే జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సంస్కృతి జట్టు 9.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో భార్గవ్ తన అద్భుత ఇన్నింగ్స్‌తో 46 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా మారాడు.

ఎస్ఎస్‌జీఎస్ ఆధిపత్యం

గుంతకల్లు ఎస్ఎస్‌జీఎస్ జట్టుపై టాస్ గెలిచిన అనంతపురంలోని కస్తూరి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫి తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ చేసిన ఎస్ఎస్‌జీఎస్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. జట్టులో తాసిఫ్ రజా 15 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్సర్‌తో 31 పరుగు లు, విజయ్‌కాంత్ 12 బంతుల్లో 2 సిక్సర్లు, 3 ఫోర్లతో 31 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కస్తూరి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 68 పరుగులు మాత్రమే చేసింది. దీంతో 64 పరుగులతో ఎస్ఎస్‌జీఎస్ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసింది.

- మరో మ్యాచ్‌లో సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ (పుట్టపర్తి)పై తలపడిన ఎస్ఎస్‌జీఎస్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 89 పరుగులు చేసింది. జట్టులో ఆది 20 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్ల సహాయంతో 41 పరుగులతో రాణించారు. సంస్కృతి బౌలర్లలో జగదీష్ 3, వాసు 2 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన సంస్కృతి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 64 పరుగులు మాత్రమే చేసింది. దీంతో 26 పరుగులతో ఎరస్ఎస్‌జీఎస్ జట్టు విజయం సాధించింది.


అద్భుతమైన షాట్‌తో బంతిని బౌండరీ దాటించిన బ్యాటర్


వరుస మ్యాచ్‌ల్లో విజయకేతనం ఎగురవేసిన గుంతకల్లు ఎస్ఎస్‌జీఎస్ జట్టు

SAKSHI DIGITAL MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE

రవి ఒంటరి పోరు

రాప్తాడులోని ఎస్వీఐటీ కళాశాల జట్టుపై టాస్ గెలిచి అనంతపురంలోని రైపర్ కళాశాల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీఐటీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసింది. జట్టులో బ్యాటర్ రవి 20 బంతుల్లో 3 సిక్సర్లు, 2 ఫోర్లతో 35 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన రైపర్ జట్టు 8 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో కుళ్లాయప్ప 21 బంతుల్లో 1 సిక్సర్, 5 ఫోర్లతో 38 పరుగులు సాధించాడు. దీంతో 6 వికెట్లతో రైపర్ జట్టు విజయం సాధించింది.

బౌండరీల వర్షం

ఎస్ఎంజీఎల్ (కదిరి)పై ఎస్‌డీఆర్‌ఆర్ (ముదిగుబ్బ) జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఎంజీఎల్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసింది. జట్టులో వెంకటేష్ నాయక్ 23 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 55 పరుగులు, సూరజ్ 18 బంతుల్లో 5 ఫోర్లతో 26 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్‌డీఆర్‌ఆర్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 80 పరుగులు మాత్రమే చేసింది. ఎస్ఎంజీఎల్ బౌలర్లలో వేణు, వంశీ చెరో 3 వికెట్లు సాధించి జట్టు విజయంలో కీలకంగా మారారు.

కొనసాగిన అనంతలక్ష్మి హవా

అనంతపురంలోని రైపర్, అనంతలక్ష్మి కళాశాలల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రైపర్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 70 పరుగులు చేసింది. అనంతలక్ష్మి బౌలర్లు గోవర్ధన్ 3, ప్రశాంత్ 2 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతలక్ష్మి జట్టు 9 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో శ్యాం 17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 35 పరుగులు చేసి, జట్టు విజయంలో కీలకంగా మారాడు.

సాయి బాలాజీ విజృంభణ

అనంతపురంలోని సాయి బాలాజీ, సాయి సిద్దార్థ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన సిదార్థ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సాయి బాలాజీ జట్టు 6.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో గిరీష్ 16 బంతుల్లో 20, ప్రశాంత్ 9 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్సర్‌తో 24 పరుగులు చేశారు. దీంతో 5 వికెట్లతో సాయి బాలాజీ జట్టు విజయం సాధించింది.

నలంద పేలవం

అనంతపురానికి చెందిన నలంద, ఆర్ట్స్ కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నలంద జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. జట్టులో జాన్ 20 బంతుల్లో 5 ఫోర్లతో 29 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆర్ట్స్ కళాశాల జట్టు 6 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో భార్గవ్ 14 బంతుల్లో 3 ఫోర్లతో 22 పరుగులు సాధించాడు. దీంతో 9 వికెట్ల తేడాతో ఆర్ట్స్ కళాశాల జట్టు విజయం సాదించింది.

బౌలర్ల శ్రమ వృథా

అనంతపురానికి చెందిన సాయిబాలాజీ, జేఎన్‌టీయూ ఓటీపీఆర్‌ఐ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సాయి బాలాజీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 78 పరుగులకు ఆలౌటైంది. జట్టు బ్యాటర్లను కట్టడి చేయడంలో ఓటీపీఆర్‌ఐ బౌలర్లు మంజునాథ్, వినోద్, శ్రీనాథ్ శ్రమ ఫలించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఓటీపీఆర్‌ఐ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 52 పరుగుల వద్ద కుప్పకూలింది. జట్టులో రాజశేఖర్ ఒక్కడే 19 బంతుల్లో 2 ఫోర్లతో 21 పరుగులతో ఒంటరి పోరు సాగించినా ఫలితం లేకపోయింది. 26 పరుగులతో సాయి బాలాజీ జట్టు విజయం సాధించింది.


ఎస్వీఐటీపై గెలుపొందిన రైపర్ కళాశాల జట్టు


రైపర్‌పై గెలుపొందిన అనంతలక్ష్మి జట్టు


నలందపై విజయం సాధించిన ఆర్ట్స్ కళాశాల జట్టు

రేషన్ బియ్యం పట్టివేత

వజ్రకరూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. వజ్రకరూరు మండలం కడమలకుంట సమీపంలో ఆదివారం ఉదయం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనాన్ని పరిశీలించగా టమాట క్రేట్ల కింద 18 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లుగా గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ఎంపీఈఓలను రెగ్యులర్ చేయాలి


మాట్లాడుతున్న సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజన్‌రెడ్డి

అనంతపురం: ఎంపీఈఓలను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భీమిరెడ్డి అంజన్‌రెడ్డి కోరారు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఏపీ సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గం సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంజన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. పని ఒత్తిడి కారణంగా ఆర్‌బీకేల్లో అదనంగా ఇద్దరిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉద్యోగులందరికీ టీఏ, డీఏ, ఇతర ఫీల్డ్ అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఎంప్లాయీస్ జిల్లా అధ్యక్షుడు ఎం.వీరనారాయణ, స్టేట్ సంయుక్త కార్యదర్శులు లావణ్య, శ్రీనివాస్, జిల్లా జాయింట్ సెక్రెటరీ నరేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది

- నిస్సహాయ రైతు కుటుంబాలకు జేసీ కేతన్‌గార్గ్ భరోసా


మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: నిస్సహాయ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జేసీ కేతన్‌గార్గ్ భరోసా ఇచ్చారు. 'జీవనరేఖ' కార్యక్రమంలో భాగంగా జేసీ ఆదివారం తన చాంబర్‌లో నిస్సహాయ స్థితిలో ఉన్న రెండు రైతు కుటుంబాలతో మాట్లాడారు. అనంతపురం మండలం చియ్యేడుకు చెందిన పెద్దకాటప్పగారి చందు, రాప్తాడుకు చెందిన నల్లప్ప కుటుంబాల పరిస్థితి స్వయంగా తెలుసుకున్నారు. తాను పక్షవాతంతో బాధపడుతున్నానని, తనకు ఇద్దరు సంతామనని రైతు చందు చెప్పాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొడుకు ఉన్నత చదువును మధ్యలో ఆపివేయించానని తెలిపాడు. పంట రుణం సకాలంలో చెల్లించినా బ్యాంకు వారు తిరిగి రుణం మంజూరు చేయడం లేదన్నాడు. తమ భూమికి డ్రిప్ సదుపాయం కల్పించాలని, జీవనోపాధికి డెయిరీ మంజూరు చేయాలని కోరాడు. మరో రైతు నల్లప్ప మాట్లాడుతూ నాలుగేళ్లుగా పంటలు సరిగా పండక నష్టం వచ్చిందన్నాడు. ప్రభుత్వం నుంచి రైతు భరోసా, అమ్మఒడి మంజూరయ్యానన్నాడు. అయితే బ్యాంకులో రుణం ఉన్నందున డబ్బు ఇవ్వకుండా ఆపారన్నాడు. జేసీ కేతన్‌గార్గ్ స్పందిస్తూ ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించి, ఆర్థిక సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అంతర్జాతీయ ఓపెన్ చెస్ చాంపియన్‌గా నోబుల్



చెస్ ట్రోఫీతో శామ్యూల్ స్టీఫెన్ నోబుల్

అనంతపురం సప్తగిరి సర్కిల్: అంతర్జాతీయ ఓపెన్ బిలో 1,600 రేటెడ్ చెస్ చాంపియన్‌గా అనంతపురానికి చెందిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ నిలిచాడు. హైదరాబాద్ వేదికగా ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకూ ఓపెన్ చెస్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. టోర్నీలో వివిధ దేశాలకు చెందిన 513 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొత్తం 9 రౌండ్లలో నిర్వహించిన పోటీల్లో 8.5 పాయింట్లను సాధించి అండర్–10 బాలుర విభాగం చాంపియన్‌గా నోబుల్ నిలిచాడు. దీంతో ట్రోఫీతో పాటు రూ.లక్ష నగదును నిర్వాహకులు అందజేసి అభినందించారు. అలాగే అనంతపురానికి చెందిన శ్రీహ 8వ స్థానం, సహృద్ 9వ స్థానాన్ని దక్కించుకున్నారు.

వేట కొడవలితో దాడి

నల్లచెరువు: కుటుంబ కలహాల నేపథ్యంలో మామ, బామ్మర్దిపై ఓ యువకుడు వేటకొడవలితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కదిరికి చెందిన బాబా ఫక్రుద్దీన్‌కు నల్లచెరువులో నివాసముంటున్న మామ మునీర్, బామ్మర్ది సమీర్‌తో మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో తరచూ ఘర్షణ పడేవారు. తనని వ్యక్తిగతంగా దూషించారన్న కారణంతో ఆదివారం వేటకొడవలితో మునీర్, సమీర్‌పై బాబా ఫక్రుద్దీన్ దాడి చేశాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే దాడిని అడ్డుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు బాబా ఫక్రుద్దీన్‌పై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వరలక్ష్మి తెలిపారు.

ఏళ్ల కల.. నెరవేరుతున్న వేళ

- కుటుంబ మ్యాపింగ్‌లో సవరణకు అవకాశం
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- సచివాలయాల్లో ముమ్మరంగా వేలిముద్రల సేకరణ
- సద్వినియోగం చేసుకుంటున్న లబ్ధిదారులు


లబ్ధిదారుల వేలిముద్రలు సేకరిస్తున్న వలంటీర్ అశోక్

సద్వినియోగం చేసుకోవాలి



కుటుంబంలో మార్పులు, చేర్పుల సవరణకు సచివాలయాలను సంప్రదించాలి. వివాహమైన వారు వేరుగా కార్డు చేయించుకోవాలంటే వివాహ ధ్రువీకరణ పత్రం తప్పక సమర్పించాలి. ప్రభుత్వం సూచించిన ఆరు పత్రాల్లో ఏదో ఒకటి జతపరిచిన ప్పుడే సవరణకు అవకాశం ఉంటుంది. అర్హత కలిగిన లబ్ధిదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– భాస్కరరెడ్డి, జెడ్పీ సీఈఓ, అనంతపురం

రాయదుర్గం: సంక్షేమ పథకం ఏది కావాలన్నా.. బియ్యం కార్డులో కుటుంబ సభ్యుల మ్యాపింగ్ తప్పనిసరి. ఈ క్రమంలో కుమారుడు, కుమార్తెలు పెళ్లిళ్లు చేసుకుని వేరు కాపురాలు పెట్టినా... నవశకం వెబ్‌సైట్‌లో చాలా మంది ఉమ్మడిగానే ఉన్నట్లు రికార్డులు చూపుతున్నాయి. దీంతో ఒకరి కారణంగా మిగిలిన అర్హులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందని ద్రాక్షగా మారాయి. తమకున్న అన్ని అర్హతలనూ చూపినా ఏళ్ల తరబడి సంక్షేమ పథకాలు అందక చాలా మంది నిరాశలో మునిగిపోయారు. ఈ సమస్యను అధిగమిస్తూ సీఎం వైఎస్ జగన్ నూతన శకానికి శ్రీకారం చుట్టారు. ఫలితంగా నవశకం వెబ్‌సైట్‌ను సంపూర్ణంగా ప్రక్షాళన చేసే ప్రక్రియ మొదలైంది.

మ్యాపింగ్ ఆధారంగానే పథకాలు

కుటుంబ మ్యాపింగ్ ఆధారంగానే సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోంది. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, వాహనమిత్ర, సామాజిక పెన్షన్ లాంటి పథకాలన్నీ ఇప్పటి వరకూ కుటుంబ మ్యాపింగ్ ఆధారంగానే అందాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సర్వే తప్పుల తడకగా ఉండడంతో నేటికీ వేల సంఖ్యలో అర్హులైన వారికి లబ్ధి చేకూరడం లేదు. ఈ పరిస్థితిని సరిదిద్దుతూ జగన్ సర్కార్ బియ్యం కార్డులో స్ప్లిట్టింగ్‌కు అవకాశం కల్పించింది. దీంతో వేలి ముద్రల సేకరణ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా ఊపందుకుంది.

వేల కుటుంబాలకు లబ్ధి

జిల్లాలోని 481 రూరల్, 180 అర్బన్ పరిధిలోని సచివాలయాల్లో 5,603 మంది ఉద్యోగులు విధుల్లో పాల్గొంటున్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది వివాహాలు చేసుకుని ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అంతకు వీరందరూ కుటుంబ సభ్యుల మ్యాపింగ్‌లో ఉండిపోవడంతో తల్లిదండ్రులు, సోదరులకు పథకాల లబ్ధి అందకుండాపోతోంది. కుమార్తెలకు పెళ్లిళ్లు జరిగి అత్తరింటికెళ్లినా పుట్టింటి వారు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొక తప్పడం లేదు. గత నెల 17 నుంచి మొదలైన సవరణ ప్రక్రియ వల్ల ఈ తరహా ఇబ్బందులతో సతమతమవుతున్న వేల కుటుంబాలకు న్యాయం చేకూరుతోంది.

తలారి చెరువు ఖాళీ


ఊరు విడిచి వెళుతున్న గ్రామస్తులు

తాడిపత్రి: అగ్గిపాడు ఆచారాన్ని పాటించడంతో తాడిపత్రి మండలంలోని తలారి చెరువు గ్రామం ఆదివారం పూర్తిగా నిర్మానుష్యమైంది. శనివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత గ్రామంలోని అందరూ విద్యుత్ దీపాలను ఆర్పి, సూర్యోదయానికి ముందే సామగ్రి, సరుకులు సర్దుకుని ఇళ్లకు తాళం వేసి సమీపంలోని హాజీ వలి దర్గాను చేరుకున్నారు. అక్కడే చెట్ల కింద వంటావార్పు చేసి, భోజనాలు ఆరగించారు. సాయంత్రం వరకూ ఆటపాటలతో గడిపారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు దాటాక గ్రామంలోకి చేరుకుని ఇంటి గుమ్మానికి టెంకాయ కొట్టి, లోపలకు వెళ్లి విద్యుత్ దీపాలు వెలిగించారు. పూజాదికాలు ముగించి, దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు.

చీనీచెట్ల నరికివేత



పెద్దపప్పూరు: మండలంలోని రెడ్డిపల్లిలో వైఎస్సార్‌సీపీ నేత నాగరాజు తమ్ముడు భాస్కర్ సాగు చేస్తున్న రెండేళ్ల వయసున్న 150 చీనీ చెట్లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు సాయిప్రతాపరెడ్డి, జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాదరెడ్డి ఆ గ్రామానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. బాధితుడిని పరామర్శించి అండగా ఉంటామని భరోసానిచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ తెలిపారు.

19న జిల్లా స్థాయి వృషభాల బలప్రదర్శన

కూడేరు: చితంబర స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని కూడేరు మండలం మరుట్ల–3వ కాలనీలో ఈ నెల 19న జిల్లా స్థాయి వృషభాల ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. పోటీల్లో భాగంగా ఒక అడుగు ఎత్తు, ఒకటిన్నర అడుగు వెడల్పు, ఏడున్నర అడుగుల పొడవున్న రాతి దూలాన్ని వృషభాలు లాగాల్సి ఉంటుందన్నారు. ఇందులో గెలుపొందిన వృషభాల యజమానులకు నగదు పురస్కారాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని, మరింత సమాచారానికి 98494 23027, 97011 19689, 93901 39909లో సంప్రదించాలని కోరారు.

హెచ్‌టీ లైన్ తగిలి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంతకల్లు: బళ్లారి మార్గంలోని బంటనహాళ్ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడు రైలు పైకి ఎక్కి ప్రయాణిస్తున్న సమయంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురైనట్లుగా నిర్ధారించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే గుంతకల్లు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఓబులంపల్లిలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాప్తాడు గడప గడప ఇన్‌చార్జ్ హరినాథ్ రెడ్డి తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు అన్నిశాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

కంటి శిబిరానికి స్పందన

అనంతపురం కల్చరల్: స్థానిక గిల్డ్ ఆఫ్ సర్వీసు పాఠశాలలో లయన్స్‌క్లబ్ అనంతపురం మెయిన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వందల మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఉచిత భోజన వసతి కల్పించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కోశాధికారి అసిఫుద్దీన్, కంబదూరి షేక్ నబీరసూల్ మాట్లాడుతూ 105 మందికి కంటి శస్త్రచికిత్సలు చేయిస్తున్నామన్నారు.

నేడు 'స్పందన'

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం జరగనుంది. డిప్యూటీ కమిషనర్ సావిత్రి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నగర ప్రజలు ఏమైనా సమస్యలుంటే తెలియజేసే అవకాశం కల్పించారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



కలశ హారతులు తీసుకెళ్తున్న మహిళలు

ఆత్మకూరు: మండల కేంద్రంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో పెద్ద ఎత్తున శివమాలధారులు గ్రామోత్సవం నిర్వహించారు. కనకదాస కళ్యాణ మండపం వద్ద భక్తులు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. అనంతరం శివలింగాన్ని, శివుని చిత్ర పటాన్ని వెండి రథంలో ఊరేగించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శివశ్రీనివాసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా కేంద్రంలోని రౌడీషీటర్లకు ఎస్పీ ఆదేశాల మేరకు త్రీటౌన్ పోలీసులు ఆదివారం రాత్రి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏ కేటగిరీలోని పలువురు రౌడీషీటర్లను సీఐ శివశ్రీనివాసులు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. క్రమశిక్షణతో నడుచుకోవాలని, భార్యాపిల్లలు, కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవనం గడపాలన్నారు. సామాన్యులపై దౌర్జన్యాలు చేస్తే నా, బెదిరించినా సహించేదిలేదని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలిగే వారికి పోలీసులు సహాయ, సహకారాలు ఉంటాయన్నారు. హెచ్చరికలను బేఖాతరు చేస్తే సహించేదిలేదన్నారు.

జామ మొక్కలను అక్రమంగా తొలగించారు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కందుకూరు పంచాయతీ కృష్ణంరెడ్డిపల్లి క్రాస్ సమీపంలోని తోటలోని జామ మొక్కలను తొలగించారని రైతు శివారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. 1.45 ఎకరాలలో దాదాపు 750 జామ మొక్కలు సాగు చేసినట్లు తెలిపాడు. శనివారం అర్ధరాత్రి రఘురాంచౌదరి అనే వ్యక్తి తోటకు ఎర్పాటు చేసిన కంచె తొలగించి, పైపులను ధ్వంసం చేసి జామ మొక్కలను తొలగించినట్లు తెలిపాడు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పోలీసు లైబ్రరీతో సత్ఫలితాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం పోలీస్ లైబ్రరీ నుంచి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షల్లో 94 మంది అర్హత సాధించి, ఈవెంట్స్‌కు ఎంపికయినట్లు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పోలీస్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన లైబ్రరీ ద్వారా ఎంతోమంది నిరుద్యోగ యువత శిక్షణ పొందేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. కష్టపడి చదివే ప్రతి అభ్యర్థికి తాము అండగా ఉంటామని ఎస్పీ తెలిపారు.

అనంతలో కిలేడీలు



- ముఠాలు నడుపుతున్న కొందరు మహిళలు
- దందాలు, దౌర్జన్యాలలో ఆరితేరుతున్న వైనం
- వెనుక ప్రైవేటు సైన్యాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలో కొందరు మహిళలు ముఠాలు నడుపుతున్నారు. దందాలు, దౌర్జన్యాలలో ఆరితేరుతున్నారు. ఉద్యోగాల పేరిట టోపీలేస్తున్నారు. కొందరు ఏకంగా హత్యలు చేయించే స్థాయికి ఎదిగిపోయారు. ప్రైవేటు సైన్యాలను వెంటేసుకుని మరీ దందాలకు దిగుతున్నారు. సమస్య ఏదైనా సరే అక్కలకు చెబితే చాలు క్షణాల్లో సెటిల్! కాకపోతే ఖర్చు కాస్త ఎక్కువే. వీరి నెట్‌వర్క్ చాలా పెద్దది. వీరు తిరిగే కార్లు, విలాస జీవితాలను చూస్తే దిమ్మతిరిగిపోతుంది. ఇటీవల అనంతపురం జిల్లాలో జరిగిన కొన్ని నేరాలు, వాటి వెనకున్న వారి హస్తాలను పరిశీలిస్తే ఎవరైనా భయపడక తప్పదు. దారుణమేమంటే సామాన్యులని బెదిరించి వారి కష్టార్జితాన్ని తన్నుకుపోతున్న కిలాడీ మహిళలకు కొంత మంది న్యాయవాదులు అండగా నిలవడం.

- ఓ జాతీయ పార్టీ పేరు చెప్పుకుని ఎన్‌డీఏస్, విజయవాడ కేంద్రంగా సాల్లో ఉద్యోగాలిప్పిస్తామని వసూళ్లకు పాల్పడిన లేడీ దందాలు ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి. ఉద్యోగాలిప్పిస్తామంటూ ఉమ్మడి అనంతపురంతో పాటు వైఎస్సార్ జిల్లాలోనూ ఈమె కలెక్షన్లు చేశారు. పోలీసు స్టేషన్లలో పంచాయితీలు, సెటిల్‌మెంట్లకు కూడా ఈమె వెళుతుండటం గమనార్హం. పైగా పోలీసులతో పెద్దపెద్ద ఆఫీసర్లు తమకు తెలుసంటూ ప్రతి పనికీ తనకింత కొంత వాటా పెట్టుకుని మరీ వెళుతున్నట్లు తెలిసింది.

- తమ ఇంటి అమ్మాయిని వేరే కులం అబ్బాయి పెళ్లాడాన్న కారణంతో ఓ మహిళ తన సమీప బంధువైన మరో మహిళతో కలిసి బిడ్డకు తాళి కట్టిన అల్లుడిని దారుణంగా హత్య చేయించింది. ఇందుకు గాను రూ.10 లక్షలు సుపారీ ఇచ్చింది. ఈ హత్యకు డబ్బు సర్దుబాటు చేసిన సమీప బంధువైన మహిళ సెటిల్ భూదందాలు, సెటిల్ మెంట్లు చేస్తోంది. రాప్తాడు సమీపంలో దాబా నిర్వాహకురాలైన ఈమె ఏకంగా ఓ ప్రైవేటు సైన్యాన్ని వెంటేసుకుని మరీ దందాలకు పాల్పడుతోంది.

- అనంతపురం నవోదయ కాలనీకి చెందిన ఓ మహిళ నగరంలో భూదందాల్లో తలదూర్చడమే పనిగా పెట్టుకుంది. ఎంతటి వారైనా సరే పంచాయితీలో పైకి లేచి దాడి నాలుగు చెంపదెబ్బలు కొట్టడం ఈమెకు వెన్నతో పెట్టిన విద్య.

- అనంతపురం బోయగేరిలో మరీ దారుణం. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఈ ప్రాంతంలో మహిళలు ఫైనాన్స్ నడుపుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులివ్వడమే కాకుండా...వాటిని వసూలు చేయడంలోనూ వీరిని మించిన వారు మరొకరుండరు. రుణగ్రహీతలు ఎంత టివారైనా సరే చొక్కా పట్టుకుని నిలదీసి మరీ వసూలు చేస్తారు. వడ్డీ కూడా నూటికి పది రూపాయలకు తక్కువేమీ ఉండదు.

- అనంతపురంలో రూ.75 లక్షల విలువైన ఆస్తి కాజేసిన మహిళా న్యాయవాది కేసు ఒకటి కొద్దిరోజుల క్రితం జిల్లాలో సంచలనం రేపింది. ఈ కేసులో న్యాయవాదితో పాటు ఆమెకు సహకరించిన కుమారుడు, ముగ్గురు సన్నిహితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇలా అనంతపురం జిల్లాలో పలువురు మహిళలు దందాలు, దౌర్జన్యాల్లో ఆరితేరి బోరా అన్పించుకుంటున్నారు.

సంత ద్వారా రూ.1.71 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాల సంత ద్వారా రూ.1,71,140 ఆదాయం సమకూరినట్లు యార్డు చైర్మన్ ఎస్.ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పశువులకు వ్యాపిస్తున్న ముద్దచర్మవ్యాధి (లంపీ స్కిన్ డిసీజెస్) కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు గతేడాది సెప్టెంబర్ మూడో వారం నుంచి మార్కెట్‌యార్డులో పశువుల సంత బంద్ చేశామన్నారు. కేవలం శనివారం మాత్రమే గొర్రెలు, మేకల క్రయ, విక్రయాలు జరుగుతున్నట్లు తెలిపారు.

వారపు సంత ప్రారంభం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని సచివాలయం -2 పక్కన ఏర్పాటు చేసిన వారపు సంత ఆదివారం ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఎంపీపీ హేమలత మాట్లాడుతూ ప్రతి ఆదివారం మండల కేంద్రంలో వారపు సంత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆదివారం నిర్వహించే సంతను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, పంచాయతీ సెక్రటరీలు శైలజ, శిరీష, వైస్ ఎంపీపీ విజయ, వైఎస్సార్‌సీపీ నాయకులు వాసుదేవరెడ్డి, మధు, ఈశ్వరరెడ్డి, తైదులశివారెడ్డి, గూలి విశ్వనాథ్‌రెడ్డి, ఓబీ ట్రైలర్ వెంకటేష్, రామునాయక్, మాదన్న, కృష్ణానాయక్, లక్ష్మీనారాయణ రెడ్డి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిపై ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాలకూ అండగా ఉంటున్నామన్నారు. ఆదివారం రుద్రంపేట పంచాయతీ పరిధిలోని విశ్వశాంతినగర్, మోటూరు ఉడయ్ కాలనీల్లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన మూడున్నర ఏళ్లలో దాదాపు రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీల్లో సైతం దాదాపు రూ.80 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడంతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు.

ప్రతిపక్ష పార్టీలకు ప్రజల సంక్షేమంపై చిత్తశుద్ధి లేదు

రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సైతం ఇతర రాష్ట్రాల్లో అమలు చేయాలని అక్కడి ప్రభుత్వాలు ప్రయత్నిస్తుంటే.. టీడీపీ, జనసేన నాయకులు మాత్రం ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నాయని మండిపడ్డారు. తాము అధికారంలో ఉన్నా ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల మధ్యలో తిరుగుతున్నామన్నారు. టీడీపీ నాయకులకు ప్రజల సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఉప సర్పంచ్ నరేంద్రరెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ బాలాజీ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఎంపీటీసీలు మహబూబ్, లక్ష్మీనారాయణమ్మ, ఓం ప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, సాదిక్‌వలి, మాజీ సర్పంచ్ కుళ్లాయప్ప, మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణవేణి, గోసబ్, తిరుపతినాయుడు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తడకలేరు బ్రహ్మోత్సవం



అశ్వత్థ నారాయణస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి పంచాయతీ పరిధిలోని తడకలేరు అశ్వత్థ నారాయణస్వామి బ్రహ్మోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అనంతపురం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తడకలేరులో కొలువు తీరిన అశ్వత్థనారాయణస్వామికి పూజలు చేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ ఈ.యర్రపరెడ్డి, సర్పంచ్ లింగేశ్వరి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్ అశ్వర్థనారాయణస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, గుడి నిర్మాణ దాత చింతాలం వెంకటేశులు, స్థానిక నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సోములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న స్వామివారి రథాన్ని శనివారం రాత్రి తడకలేరు అశ్వర్థనారాయణస్వామి వరకు లాగారు. తిరిగి సోమవారం ఉదయం ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేర్చుతారని నిర్వాహకులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ విజయభాస్కర్‌గౌడ్, ఎస్ఐలు నబీరసూల్, వెంకటరమణ, ప్రవీణ్, సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సౌత్‌జోన్ జూడో పోటీల్లో సత్తా



రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన అనంత బాలుర జట్టు



జూనియర్ విభాగంలో మూడో స్థానంలో నిలిచిన అనంత బాలికలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఖేలో ఇండియా సౌత్‌జోన్ జూడో పోటీల్లో అనంత బాలికలు సత్తా చాటారు. కేరళలోని త్రిసూర్‌లో ఈ నెల 3 నుంచి 5 వరకు నిర్వహించిన సౌత్‌జోన్ జూడో పోటీల్లో క్యాడెట్ విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో రెండో స్థానాన్ని, జూనియర్ బాలికల విభాగంలో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ టోర్నీలో మొత్తం అనంతకు చెందిన బాలికలు 3 స్వర్ణం, 4 రజతం, 12 కాంస్య పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్యాడెట్ విభాగంలో వైష్ణవి స్వర్ణం, జూనియర్ విభాగంలో భార్గవి, గంగోత్రీలు, క్యాడెట్ విభాగంలో రజత పతకాలను లావణ్య, పూజ, జూనియర్ విభాగంలో వైష్ణవి, శ్రీలక్ష్మిలు నిలిచారు. క్యాడెట్, జూనియర్ విభాగాల్లో హేమవర్షిత, పూజిత, శ్రీనిత్య, హారిక, యశ్విత, నందిని, సాయిప్రియ, జాహ్నవి, నందిని, యశ్విని, పూజిత, హారికలు నిలిచారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో అనంత బాలుర జట్టు సత్తా

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -14 బాస్కెట్‌బాల్ పోటీల్లో అనంత బాలుర జట్టు సత్తా చాటి తృతీయ స్థానంలో నిలిచింది. ఈ నెల 3 నుంచి 5 వరకు ఏలూరు జిల్లాలోని నూజివీడులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటింది. తృతీయ స్థానంలో భాగంగా గుంటూరు జట్టుపై 22–12 స్కోరుతో విజయం సాధించి, విజేతగా నిలిచి మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. జిల్లా బాలుర జట్టును జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖాధికారి కృష్ణయ్య, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రవికుమార్ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మాఘ పౌర్ణమి వేడుకలు



సామూహిక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: నగరంలో పవిత్ర మాఘపౌర్ణమిని పురస్కరించుకొని వాడవాడలా ఆధ్యాత్మిక పరంపర కొనసాగింది. తిరునాళ్లు, జాతర్లతో పాటు సత్యదేవుడి పూజలు వివిధ ఆలయాల్లో పెద్ద ఎత్తున జరిగాయి. ఆదివారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సత్యదేవుని నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. స్థానిక అశోక్‌నగర్‌లోని శ్రీరామ సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. లక్ష్మీసత్యనారాయణ స్వామి ప్రత్యేక పూజలందుకున్నారు. భక్తులు బారులు తీరి సామూహిక పూజలు, వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబటి ఫణిరాజ్ ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బాబా మందిరాలలో సత్యదేవుడి వ్రతాలు కనుల పండువగా సాగాయి.

మాఘమాస పౌర్ణమి వేడుకలు

రాప్తాడు: మండలంలోని ఆలయాలు ఆదివారం మాఘమాస పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులతో నూతన శోభను సంతరించుకున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాప్తాడులో నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో శివుడికి అన్నాభిషేకం, రుద్రాభిషేకం, గోక్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ప్రత్యేక వాహనంలో శివ మాలధారులు నీలకంఠేశ్వర స్వామిని ఊరేగించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. గొందిరెడ్డిపల్లిలో ముష్టూరు ఉజ్జినప్ప స్వామికి కాపులు పొంగలు నిర్వహించారు. అనంతరం ఉజ్జినప్పస్వామి శిలకు అభిషేకం నిర్వహించారు. గంగలకుంటలో నారాయణస్వామి కట్ట దగ్గర దర్వాజం ప్రాంతానికి చెందిన స్వామి కాపులు పొంపొంగులు నిర్వహించారు. మరూరులో చిన్నకదిరయ్యస్వామి, అయ్యవారిపల్లిలో ఎర్రితాతా స్వామి, బుక్కచెర్లలో నల్లమ్మ, యర్రగుంట, పుల్లలరేవు గ్రామాల్లోని చెన్నకేశవ స్వామి, గంగలకుంటలో దద్దమ్మ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివాలయాల్లో మాఘ పౌర్ణమి పూజలు

కనగానపల్లి: మండలంలోని పలు శివాలయాల్లో మాఘపౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో కనగానపల్లిలోని మల్లికార్జునస్వామి, తగరకుంటలో మల్లప్పస్వామి, ముక్తాపురంలోని ముక్తీశ్వరాలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజామున నుంచే భక్తులు శివలింగాలకు అభిషేకాలు, పూజలు జరిపారు. తగరకుంటలో శివస్వాములు, గ్రామస్తుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. ముక్తాపురంలో శివభక్తుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మాఘమాస ఉత్సవాల్లో భాగంగా మూడో ఆదివారం సత్యనారాయణ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకాలు, ఉదయం నుంచి సాయంత్రం వరకు పాలాభిషేకం, బంగారు కవచసేవ, అలంకరణ, ఆకుపూజ, కుజదోష, రాహుకేతు దోష, సర్పదోష కాల సర్పదోష, రాహుకేతు దోష పూజలు చేశారు. అనంతరం స్వామి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి ప్రత్యేకంగా పూజలు చేసి, మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఆర్మిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఎర్రిస్వామి, అర్చకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి

కనగానపల్లి: రాష్ట్రంలో బీజేపీ బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఆదివారం పర్వతదేవరపల్లిలోని మల్లికార్జున ఆలయ కళ్యాణ మండపంలో గుత్తా సాయి జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, జిల్లా నాయకులు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకుడు నారా లోకేష్ చేస్తున్న పాదయాత్ర జనం లేక వెలవెలబోతోందని అన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వజ్ర భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాకే ఓబిలేసు, పార్థసారథి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

విమర్శకులకు ఉన్నత స్థానమిచ్చిన రాయలసీమ



కవయిత్రుల కవితాంతరంగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాచపాళెం తదితరులు

అనంతపురం కల్చరల్: వీరభూమి అయిన రాయలసీమలో విమర్శకులకు ఉన్నత స్థానమిచ్చి గౌరవించారని కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయభవన్‌లో రాజారాం రచించిన కవయిత్రుల కవితాంతరంగం పుస్తకావిష్కరణ జరిగింది. డా.శాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా రాచపాళెంతో పాటు రామాయణం రాజేశ్వరి, డాక్టర్ షమీవుల్లా తదితరులు పాల్గొని మాట్లాడారు. కొత్తగా రాస్తున్న కవయిత్రులకు కరదీపంగా ఉండే పుస్తకాన్ని రాసిన రాజారామ్ అభినందనీయుడన్నారు. ఐందులో వ్యాసాలు ప్రతిభాపరిశీలనను ఆవిష్కరిస్తాయని, నిర్మాణ శిల్పం, అనుభూతి కేంద్రంగా సాగిన పుస్తకాన్ని ఆద్యంతం చదవింపజేస్తుందన్నారు. సూఫీకవి రియాజుద్దీన్ ఆహ్వానంతో ఆరంభమైన సాహితీ సమావేశంలో డాక్టర్ రాధేయ, డాక్టర్ ఎం.ప్రగతి, నానీల నాగేంద్ర, కొత్తపల్లి సురేష్ రాజారాం విమర్శ గొప్పతనాన్ని తమ అక్షరాల్లో వినిపించారు. సీనియర్ కథా రచయిత డాక్టర్ శాంతి నారాయణ, జనప్రియ కవి ఏలూరు యంగన్న, మానవతా సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల అమరనాథ్‌రెడ్డి, షరీఫ్, ఉంటె శ్రీనివాస్, నబీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.



వసంతమా.. కాగితాల తోరణమా!

మొక్క ఎదుగుతూ ఇగురు అయ్యింది. ఇగురు ఆకులై కొమ్మలా పెరిగింది. కొమ్మ.. కొమ్మా.. కలిసి చెట్టులా పెంచుకుంది..పెంచుకున్న చెట్టు.. పూలై పూసింది.. పూసిన పూలన్నీ 'వసంతం'లా వికసించి, ఎదలల్లిన రంగుల కాగితాల్లా కళ్లకు విందుగా కనిపిస్తుంటే.. హాయిని గొలుపుతున్న అక్కడి వాతావరణాన్ని పర్యాటకులు ఆస్వాదిస్తూ.. ఆహా అంటూ మైమరిచిపోతున్నారు. రెండు వైపులా రంగుల చెట్లు అల్లుకొని ఉండగా.. మధ్యలో పర్యాటకులు, పాదచారులు వెళ్తుంటే.. స్వాగత తోరణంలా కప్పుకున్న ఈ సుందర దృశ్యం పెన్నహోబిలం పీఏబీఆర్ జలాశయం వద్ద ఆవిష్కృతమైంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం :

